epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి : 18 సంచిక : 317 ఎడిటర్ : విక్రం కుమార్ ఆదివారం 27, జులై 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

## హెచ్‌సీయూ స్కాంపై చర్చకు సిద్ధమా?

**రూ.10 వేల కోట్ల కుంభకోణం, రూ.1660 కోట్ల కాంట్రాక్ట్‌పై తేలుద్దాం**

- సీఎం రేవంత్, ఎంపీ రమేశ్ వస్తరా?
- తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

2లో









## అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని మోదీ

**'మార్నింగ్ కన్సల్ట్' సంస్థ గ్లోబల్ లీడర్ సర్వే**

2లో

- ఈ సర్వేలో అత్యంత విశ్వసనీయ నేతగా మోదీకి అగ్రస్థానం
- మోదీకి దాదాపు 75 శాతం మంది మద్దతు
- ఈ జాబితాలో దక్షిణ కొరియాకు చెందిన లీ జే-మ్యుంగ్ కు రెండో స్థానం

## భద్రాచలం వద్ద 32 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

- ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం
- నీటి మట్టం పెరగడంతో స్నాన ఘట్టాల వద్ద వరద నీటిలో మునిగిన మెట్లు
- వరద ప్రవాహంతో నీటిమట్టం ఇంకా పెరుగుతుందంటున్న అధికారులు

2లో





## వారికి ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది..

- కార్గిల్ అమరవీరులకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళులు
- కార్గిల్ యుద్ధం జరిగి నేటికి సరిగ్గా 26 ఏళ్లు
- కార్గిల్ అమరవీరులకు నివాళులర్పిస్తూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ట్వీట్
- యుద్ధంలో వారి త్యాగం, మన సాయుధ దళాల అచంచల సంకల్పానికి నిదర్శనమన్న రాజ్‌నాథ్

## భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం.. కానీ!

- పాకిస్థాన్ ఉప ప్రధాని కీలక వ్యాఖ్యలు
- చర్చల విషయంలో న్యూఢిల్లీదే తుది నిర్ణయమన్న పాకిస్థాన్
- చర్చల అంశంలో భారత్ అధికారిక స్పందన కోసం ఎదురు చూస్తున్నట్లు వెల్లడి
- గతంలోని విధివిధానాల ఆధారంగా చర్చలు ఉండాలని నిబంధనలు

2లో



## నదులకు భారీగా వరద నీరు.. పుకార్లను నమ్మవద్దంటూ ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షా లు
- గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులకు వరద నీరు
- దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు



నైరుతి రుతుపవనాల కారణంగా కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అలర్ట్ జారీ చేసింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని తెలిపింది. వరద ప్రవాహం ఇంకా హెచ్చరిక స్థాయిని చేరలేదని, అయినప్పటికీ దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున ఆయా నదుల పరీవాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు, లోతట్టు ప్రాంతాల్లో ఉండే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. సోషల్

తరువాయి 2లో



2లో

## ఈ రాత్రికి.. సింగపూర్ వెళుతున్నాం

- 5 రోజుల పాటు సీఎం చంద్రబాబు బృందం పర్యటన
- సింగపూర్ ను అత్యంత విలువైన భాగస్వామిగా పేర్కొన్న చంద్రబాబు
- బ్రాండ్ ఏపీని ప్రోత్సహించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని ఆశాభావం

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక



## నదులకు భారీగా వరద నీరు... పుకార్లను నమ్మవద్దంటూ ఏపీఎస్డీఎంఏ అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేసింది. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయరాదని హెచ్చరించింది. కాగా, రాత్రి 7 గంటల సమయానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 35.3 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో 4.44 లక్షల క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో కూడా అదే స్థాయిలో 4.44 లక్షల క్యూసెక్కులుగా ఉంది. అటు, తుంగభద్ర నదిలోనూ 40 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండడంతో ప్రభావిత జిల్లాల్లోని మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు.

వర్ష సూచన: ఏపీలోని పలు జిల్లాలకు ఏపీఎస్డీఎంఏ వర్ష సూచన చేసింది. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, విశాఖ, విజయనగరం జిల్లాల్లో రేపు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగతా చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

## వారికి ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది..

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. దేశాన్ని రక్షించడం కోసం అత్యంత కఠినమైన పరిస్థితుల్లో అసాధారణ ధైర్యసాహసాలు, దృఢ సంకల్పంతో పోరాడి ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్నానని ఆయన అన్నారు. కార్గిల్ యుద్ధంలో వారి త్యాగం, మన సాయుధ దళాల అచంచల సంకల్పానికి నిదర్శనమని కొనియాడారు. దేశం ఎల్లప్పుడూ వారికి రుణపడి ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

## హైవేపై కూలిన విమానం.. పైలట్‌తో సహా ఇద్దరు మృతి

ఇటలీలో ఘోర విమానం ప్రమాదం చోటుచేసుకుంది. ఒక చిన్న విమానం హైవేపై కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. బ్రెసికా సిటీ సమీపంలో ఈ ఘటన జరిగింది. చిన్న తరహా అల్ట్రాలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉన్నట్టుండి రోడ్డుపై కుప్పకూలింది. దీంతో విమానం కూలిన తర్వాత భారీగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పైలట్ సహా ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. బహుశా విమానం కంట్రోల్ తప్పి ఉంటుందని, ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేద్దామనుకున్న సమయంలో.. ఆ ఫ్లైట్ నోస్‌డైవ్ చేసి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కిందకు డైవ్ చేసిన ఆ విమానం హైవేను ఢీకొట్టింది. ఫ్రేషియా ఆర్జీ అల్ట్రాలైట్ విమానాన్ని కార్బన్ ఫైబర్‌తో తయారు చేశారు. వింగ్ వెడల్పు 30 ఫీట్లు ఉంటుంది. చాలా వేగంగా ఆ విమానం రోడ్డును ఢీకొనడం సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. విమానం పేలిన సమయంలో ఇద్దరు బైకర్లు గాయపడ్డారు.

## ఆరు నెలల్లో విజయవాడ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి నారాయణ

అమరావతి: రాబోయే ఆరు నెలల్లో విజయవాడ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి నారాయణ స్పష్టం చేశారు. విజయవాడలోని కాలువలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.500కోట్లతో ప్రారంభించిన పనులను వైకాపా ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేసిందన్నారు. 55శాతం పనులు తెదేపా హయాంలోనే పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా పనులు ఆరు నెలల్లో పూర్తి చేసి నగర ప్రజలకు డ్రైనేజీ సమస్య నుంచి విముక్తి కల్పిస్తామన్నారు.



ఆక్రమణలు తొలగించి పేదలకు వేరే చోట ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీ మద్యం కేసు.. నిందితుల నివాసాల్లో సిట్ సోదాలు



హైదరాబాద్: ఏపీ మద్యం కేసు నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సిట్ సోదాలు చేపట్టింది. ఈ కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి కార్యాలయంలో సిట్ అధికారులు సోదాలు చేస్తున్నారు. బాలాజీ గోవిందప్ప ఉండే భారతి సిమెంట్స్ కార్యాలయంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. నానక్‌రామ్‌గూడలో చాణక్యకు చెందిన టీగ్రిల్ రెస్టారెంట్‌లోనూ తనిఖీలు చేపట్టారు. మద్యం కేసు నిందితులు ఎక్కడ సమావేశమయ్యారనే అంశాలపై సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. సాంకేతిక ఆధారాలు సేకరించి సోదాలు చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సిట్ సోదాలు కొనసాగుతున్నాయి. ఏడుగురు అధికారులతో కూడిన సిట్ బృందం సోదాలు చేస్తోంది

## కూటమి ప్రభుత్వం వచ్చాకే కొత్త రోడ్ల నిర్మాణం జరుగుతోంది

* మంత్రి సవిత

వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పర్యటించారు. రూ.10.15 కోట్లతో అభివృద్ధి చేసిన నరగాయపాలెంవెంకుపాలెం, తిమ్మాయపాలెం దొండపాడు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ..వైకాపా హయాంలో రోడ్లు వేసింది శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. కూటమి ఏడాది పాలనలో బాగుపడ్డ రోడ్ల పరిస్థితే ఇందుకు నిదర్శనమని జీవీ ఆంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.861 కోట్లతో 20 వేల కి.మీపైగా రోడ్లకు మరమ్మతులు చేశామని పేర్కొన్నారు. కొత్త రోడ్ల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెప్పారు.

# అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని నరేంద్ర మోదీ..

ప్రధాని నరేంద్ర మోదీకి మరో అరుదైన గుర్తింపు లభించింది. ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయ నేతగా ఆయన నిలిచారు. 'మార్నింగ్ కన్సల్ట్' సంస్థ గ్లోబల్ లీడర్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో భారతీయులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది విశ్వసించే నేతగా ప్రధాని మోదీ మొదటిస్థానంలో నిలిచారు. దాదాపు 75 శాతం మంది మద్దతుతో అత్యంత విశ్వసనీయత కలిగిన నాయకుడిగా మోదీ ప్రపంచ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ విషయాన్ని బీజేపీ నేత అమిత్ మాలవీయ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "కోట్లకు పైగా భారతీయులచే ప్రేమించబడ్డ, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిచే గౌరవించబడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి మార్నింగ్ కన్సల్ట్ గ్లోబల్ లీడర్ అప్రూవల్ ట్రాకర్‌లో అగ్రస్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక రేటింగ్ పొందిన, అత్యంత విశ్వసనీయ నాయకుడు. బలమైన నాయకత్వం, ప్రపంచ గౌరవం, భారత్ సురక్షితమైన చేతుల్లో ఉంది" అని ఆయన రాసుకొచ్చారు. ఇక, ఈ జాబితాలో దక్షిణ కొరియాకు చెందిన లీ జేమ్యుంగ్ 59 శాతం మంది మద్దతుతో రెండో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే (57 శాతం), కెనడా ప్రధాని మార్క్ కార్నీ (56 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 44 శాతంతో ఎనిమిదో స్థానంలో ఉన్నారు.

# ఈ రాత్రికి సింగపూర్ వెళుతున్నాం: సీఎం చంద్రబాబు

ఏపీకి పెట్టుబడుల రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం నేడు సింగపూర్ వెళుతోంది. ఈ పర్యటన ఐదు రోజుల పాటు సాగనుంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. ఈ రాత్రికి సింగపూర్ వెళుతున్నామని వెల్లడించారు. అభివృద్ధిలో తమకు అత్యంత విలువైన భాగస్వామి, శక్తిమంతమైన తెలుగు సమాజానికి నెలవుగా ఉన్న దేశం సింగపూర్ అని కొనియాడారు. "రేపు సింగపూర్ మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, తెలుగు డయాస్పోరా సభ్యులను కలవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో సింగపూర్ ఒక కీలక భాగస్వామిగా ఉంది. ఆసియాలో అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా, దార్శనిక దేశంగా సింగపూర్ వర్ధిల్లుతోంది. లోతైన సహకారం దిశగా విలువైన అవకాశాలను అందిస్తుంది. మా విశ్వసనీయ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి, అంతర్జాతీయ వేదికపై బ్రాండ్ ఏపీని ప్రోత్సహించడానికి, నూతన ప్రగతిశీల విధానాలను చాటిచెప్పడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. అంతేకాదు, సమ్మిళిత వృద్ధి దిశగా శాశ్వత సహకారాలను నెలకొల్పేందుకు ఇదొక అవకాశం" అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కాగా, సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఉన్నతాధికారులు కూడా వెళుతున్నారు.

# భద్రాచలం వద్ద 32 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం ఏడు గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 32.5 అడుగులకు పైగా నమోదైంది. నీటిమట్టం పెరుగుదల కారణంగా స్నాన ఘట్టాల వద్ద మెట్లు వరద నీటిలో మునిగిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం కొనసాగితే భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం మండలం పరిధిలోని పర్ణశాల వద్ద నార చీరల ప్రదేశానికి వరద నీరు చేరడంతో పర్యాటకులను అనుమతించడం లేదు. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. భద్రాచలం పట్టణంలోకి స్లూయిజ్‌ల ద్వారా వరద నీరు ప్రవేశించకుండా నిరోధించడానికి అధికారులు మోటార్లను ఏర్పాటు చేశారు.

# భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం... కానీ!

భారత్‌తో కలిసి పనిచేయడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందని, చర్చల విషయంలో న్యూఢిల్లీ తుది నిర్ణయం తీసుకోవాలని ఆ దేశ ఉప ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ పేర్కొన్నారు. చర్చల విషయంలో భారత్ అధికారిక స్పందన కోసం తాము ఎదురు చూస్తున్నామని ఆయన వెల్లడించారు. వాణిజ్యం, ఆర్థిక సహకారం, ఉగ్రవాదంపై పోరాటం వంటి ప్రతి అంశంలో భారత్‌తో కలిసి పనిచేయడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే, చర్చలు అర్థవంతంగా ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. కశ్మీర్ అంశం, సరిహద్దు భద్రత, ఆర్థిక సంబంధాల్లో ఉన్న ఆందోళనలపై గతంలోని విధివిధానాల ఆధారంగానే చర్చలు జరగాలని ఆయన షరతులు విధించారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గతంలో మాట్లాడుతూ, చర్చలకు సిద్ధమని తెలిపారు. అదే సమయంలో కశ్మీర్, ఉగ్రవాదం, వాణిజ్యం, జల వివాదం సహా అన్ని సమస్యలపై ఇరు దేశాలు చర్చించాలని ఆయన షరతు విధించారు.

# హెచ్‌సీయూ స్కాంపై చర్చకు సిద్ధమా?

హైదరాబాద్, జూలై 26: 'దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో దిక్కుమాలిన కుమ్మక్కు రాజకీయం నడుస్తున్నది..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బావమరిదికి రూ.1137 కోట్ల అమృత్ కాంట్రాక్ట్ ఇస్తే, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ.1600 కోట్ల రోడ్డు కాంట్రాక్ట్‌ను కట్టబెట్టింది.. ఈ అక్రమ కాంట్రాక్టులే రెండు జాతీయ పార్టీల దిగజారుడు తనానికి నిదర్శనం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్, సీఎం రమేశ్‌ల బాగోతం బయటపెట్టడంతో కుడితిలో పడిన ఎలుకలా ఇద్దరూ గిలగిలా కొట్టుకుంటున్నారని శనివారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. హెచ్‌సీయూ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు దోచుకున్న తప్పుడు పనికి సహకరించినందుకు ఒక రోడ్డును సృష్టించారని హాట్ కామెంట్స్ చేశారు. సీఎం రమేశ్, సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసివస్తే హెచ్‌సీయూ రూ.10 వేల కోట్ల కుంభకోణం, రూ.1660 కోట్ల రోడ్డు కాంట్రాక్టుపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. 'నేను ఆనాడు చెప్పింది ఈనాడు రుజువైంది..అటెన్షన్ డైవర్షన్ కోసం పనికిరాని కథలు చెప్తున్నారు.. రూల్స్ బ్రేక్ చేయడం.. అనుకున్న వాళ్లకు అడ్డదారిలో కాంట్రాక్టు అప్పగించడం నీ దోస్త్ రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య..నీ దోస్త్ రూ.10 వేల కోట్లు కొల్లగొట్టేందుకు సహకరించినందుకు నీకు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ రూ.1600 కోట్ల కాంట్రాక్ట్ అని తేటతెల్లమైంది' అంటూ నిప్పులు చెరిగారు. ఈ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్ఎస్ విలీనమనే పనికిరాని, పసలేని చెత్త అంశాన్ని తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. 'తెలంగాణ ప్రజల కోసం పుట్టిన పార్టీ..రాష్ట్ర సాధన కోసం పోరాడిన పార్టీ..అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపిన పార్టీ.. ఏనాడూ ఏ పార్టీలోనూ విలీనమయ్యే ప్రసక్తే లేదని తెలంగాణ ప్రజలకు తెలుసు' అని స్పష్టంచేశారు. ఇరకాటంలో పడిన ప్రతిసారీ ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ అక్కరకురాని చెత్త విషయాన్ని తెరపైకి తెచ్చి తెలంగాణ ప్రజానీకాన్ని గందరగోళ పరచాలని చూస్తున్నాయని మండిపడ్డారు. దమ్ముంటే రేవంత్‌రెడ్డి..రమేశ్ ఇద్దరూ కలిసి చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు

: మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణా: రాష్ట్రంలో జరుగుతున్న సుపరిపాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైకాపా హయాంలో ప్రజలు బాగా విసిగిపోయారని, ఏదైనా సమస్య చెప్పుకోవాలంటే భయపడే పరిస్థితి ఉండేదని తెలిపారు. మరోసారి వైకాపాకు అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడులో శనివారం ఆయన పర్యటించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల స్పందన ఎలా ఉందని



ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమించి, నిధులు సమకూర్చి రాష్ట్రాన్ని అభివృద్ధివైపు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ (నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీమ్) నిధులను రహదారుల అభివృద్ధికి వినియోగించినట్లు పేర్కొన్నారు. సుమారు 90 శాతం రహదారులను పూర్తి చేసినట్లు వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు కొండ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

: సురేశ్ కుమార్

విజయవాడ: పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ అన్నారు. విజయవాడలోని పంజా సెంటర్‌లో తొలిసారిగా ఏర్పాటు చేసిన తృప్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెల్లూరులో ప్రారంభించిన తృప్తి క్యాంటీన్ విజయవంతం కావడంతో విజయవాడలో తొలిసారిగా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 750 క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. మెప్మా సహకారంతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని స్వయం సహాయక మహిళలతో వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం తెప్పించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. మెప్మా ఉత్పత్తులకు ఒక బ్రాండ్ కల్పిస్తామని, భవిష్యత్తులో మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సాహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్, తదితరులు పాల్గొన్నారు.



epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక





## స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొందాలి

* **బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్..**

రాయపోల్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయపోల్ మండలంలో బిజెపి పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందాలని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రం రాయపోల్ ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి కార్యకర్త వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. వార్డు సభ్యులు సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నిక ఏదైనా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడినే నిలబెట్టాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో దేశంలోని పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని అందరూ కసితో ఉన్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ కనకయ్య, మండల ఎన్నికల ప్రబారి గోవిందు, మండల అధ్యక్షుడు మాంకిడి స్వామి, కన్వీనర్ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిలస్వామి, గణేష్, మాజీ అధ్యక్షులు రాజ గౌడ్, వెంకట గౌడ్ జనరల్ సెక్రెటరీ నీల స్వామి, నాయకులు ప్రభాకర్ రెడ్డి సమరేందర్ రెడ్డి, వెంకట్ గౌడ్, గజ్వేల్ రాంచంద్రం, తలారి నర్సింలు, కృష్ణ, నరేష్ గౌడ్, రాజ గౌడ్, షాదుల్ తదితరులు ఉన్నారు.



## పోచమ్మ తల్లి బోనాల పండుగకు ఆహ్వానం

పటాన్ చెరు(గుమ్మడిదల), జులై 26, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం, దోమడుగు, అనంతారం గ్రామాలలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న శ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని ఆయా గ్రామాల యువకులు ఆహ్వానించారు. పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా తొట్టెల ఊరేగింపు, ఫలహారం బండి ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సంప్రదాయాలను కాపాడుతూ, ప్రతి ఏడాది ఇదే తరహాలో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు ఊరేగింపులు నిర్వహించాలని తెలిపారు. యువకులు నిర్వహించే కార్యక్రమాలకు తాను తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా భక్తి భావనతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొల్పేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.



## హవేలీ ఘన్పూర్ మండలం దూప్ సింగ్ తండా వాగును సందర్శించిన మెదక్ ఆర్డీవో రమాదేవి

మెదక్, జులై26 (సమయం న్యూస్) : శనివారం మెదక్ ఆర్డీఓ రమాదేవి హవేలీ ఘన్పూర్ మండలం ధూప్ సింగ్ తండా భారీ నీటి ప్రవాహం కారణంగా వాగు పొంగిపొర్లింది. ఆర్డీవో రమాదేవి రెవిన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ భారీ నీటి ప్రవాహం కారణంగా వాగు పొంగిపొర్లుతుందని ప్రస్తుతం దూప్ సింగ్ తండాకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. అని తెలిపారు. వంతెన దగ్గర హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే నివేదించాలని పంచాయతీ కార్యదర్శిని ఆర్డీఓ ఆదేశించారు.

## సచివాలయంలో చేనేత జౌళిశాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమీక్ష

* **ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి తుమ్మల**
* **మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించబోయే చీరల ఉత్పత్తి వేగవంతం చేయాలి - మంత్రి తుమ్మల**



హైదరాబాద్, జూలై26 (సమయం న్యూస్) : సచివాలయంలో చేనేత జౌళిశాఖ పథకాల అమలు తీరును జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 7 న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేపట్టబోయే వేడుక ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భారతీయ సంస్కృతిలో పట్టు, కాటన్, చేనేత వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదు. నేటితరం యువత కూడా చేనేత ఉత్పత్తులను ఆదరించడం విశేషం. చేనేత రంగంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది. సంప్రదాయ చేనేతలైన గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, ఆర్మూర్ పితాంబరీ, మహదేవ్ పూర్ టస్సర్ పట్టుచీరలు, డ్రెస్ మెటీరియల్స్, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్ షీట్లు, ఆలంపూర్ టవల్స్, దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా పేరుగాంచాయి. వీటిని కూడా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే వస్త్ర ప్రదర్శనలో ఆయా చేనేత సంఘాల ద్వారా ప్రదర్శించాలని మంత్రిగారు సూచించారు. మార్కెట్ డిమాండుకి అనుగుణంగా మరియు మార్కెట్లో పోటిపడే విధంగా క్వాలిటీ వస్త్రాలను చేనేత సంఘాలు ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు సూచించారు. చేనేత రుణమాఫీ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసి, వారి ఖాతాలలో రుణమాఫీ నిధులు జమ చేయాలన్నారు. ఇందిరా క్రాంతి మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరలను పరిశీలించి, వాటి ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఇచ్చిన ఇండెట్ల ప్రకారం వస్త్రాల మరియు మహిళాశక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు నిరంతరం పని కల్పించడం జరుగుతున్నదని మంత్రిగారు తెలియజేశారు. నేతన్నల సంక్షేమం కోసం తెలంగాణ చేనేత అభయహస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు, భరోసా, భద్రతా పథకాలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చేనేతజౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజారామయ్యర్ మరియు చేనేత జౌళిశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



నిజామాబాద్, జూలై 26(సమయం న్యూస్). : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శనివారం బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సందర్శించారు. అంతకుముందు కలెక్టర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్), క్రిటికల్ కేర్ యూనిట్ లతో కూడిన భవన సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం జీజీహెచ్ లో ఆసుపత్రి పనితీరుపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష జరిపారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకనూ కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటి గురించి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మరింతగా మెరుగుపర్చాలని, అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తామని సూచించారు. వివిధ వైద్య సేవల కోసం ప్రతిరోజు 1800 నుండి 2000 మంది వరకు అవుట్ పేషంట్ రోగులు జీజీహెచ్ కు వస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని విభాగాల పనితీరు మెరుగుపడేలా చూడాలన్నారు. అన్ని విభాగాలలో 180 మంది వైద్యులు, సరిపడా సిబ్బందితో పాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు జీజీహెచ్ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మేజర్, మైనర్ సర్జరీలతో పాటు షుగర్, బీపీ, డెంగ్యూ, మలేరియా, థైరాయిడ్ వంటి వ్యాధి నిర్ధారణ టెస్టులు ఉచితంగా చేస్తారని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వీటికి వేల రూపాయల రుసుము వసూలు చేస్తారని అన్నారు. అన్ని విభాగాలలో ప్రైవేట్ తో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిపుణులైన వైద్యులు, వారికి అనుబంధంగా మెడికోలు ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జీజీహెచ్ లో కీలు మార్పిడి శాస్త్ర చికిత్సలు నిర్వహిస్తుండడం జరుగుతోందని, డెంటల్ విభాగం ఆధ్వర్యంలో ఎంతో ఖర్చుతో కూడుకుని ఉన్న సర్జరీలను కూడా స్థానికంగా చేస్తున్నారని అన్నారు. విద్యారంగం తరహాలోనే వైద్య రంగం పని తీరును మరింతగా మెరుగుపర్చాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ మేరకు ఆసుపత్రికి అవసరమైన ఆధునాతన వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను, టాయిలెట్లను చక్కదిద్దాలని, లీకేజీలను అరికట్టాలని, ఫ్లోరింగ్, ఆసుపత్రి ముందుభాగంలో కిటికీల అద్దాలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, నెల రోజుల లోపు పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు గడువు విధించారు. పదిహేను సంవత్సరాల క్రితం నిర్మించిన ఆసుపత్రి కావడం వల్ల నిర్వహణ పరమైన లోపాలను కూడా చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీజీహెచ్ తో పాటు బోధన్, ఆర్మూర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొని ఉన్న చిన్న చిన్న ఇబ్బందులను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన బోధన, రుచికరమైన ఆహారం, ఆరోగ్యం అందించాలి

* **జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**





కొమరం భీమ్ ఆసిఫాబాద్ జూలై26 (సమయం న్యూస్) : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, రుచికరమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల పెట్రోల్ పంపు ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించి పాఠశాల పరిసరాలు, త్రాగునీటి కుళాయిలు, తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఇప్పటి నుండే 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో గల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి జ్వర పీడితులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆసుపత్రి పర్యవేక్షకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషంట్ సేవలు, ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. వివిధ చికిత్సల కొరకు వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన ఔషధ నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో గల మన ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి స్ప్రే మందులను పరిశీలించి వాటి ధరల వివరాలు, స్టాకు రిజిస్టరు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి నాట్లు కొనసాగుతున్నందున రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. స్టాకు నిల్వలు, ధరల పట్టికను షాపు ముందు కచ్చితంగా ప్రదర్శించాలని తెలిపారు. జిల్లాలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించి ఇండ్ల ఆవరణలో గల పాత సామాన్లు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రస్తుతం చర్యలు చేపట్టాలని, వ్యాధుల వ్యాప్తి నియంత్రణపై పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వ్యవసాయదారులు, ప్రజలు వాగుల వద్దకు వెళ్లకూడదని, అత్యవసరమైతేనే బయటకు రావాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలను తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులు తనిఖీలు నిర్వహించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మధుకర్, కాగజ్ నగర్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు మనోహర్, వ్యవసాయ శాఖ అధికారులు, ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం తో పాటుగా సబ్జెక్ట్ పై అవగాహన కల్పించాల్సిన భాధ్యత టీచర్ల దే

* **జిల్లా కలెక్టర్ హనుమంతవరావు.**

యాదాద్రు భువనగిరి జులై26(సమయం న్యూస్) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టుల పై అవగాహన పెంచాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రోజు తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. పాఠశాలలో టీచర్ల రిజిస్టర్ పరిశీలించి మొత్తం ఎంతమంది అని అడిగి తెలుసుకొని ఎంత మంది గైర్హాజరు అయ్యారని రిజిస్టర్ ను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎవ్వరు గైర్హాజరు కాకుండా విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్త అడ్మిషన్స్ ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల పై తల్లిదండ్రులకు పిల్లల భవిష్యత్తు పై నమ్మకం పెరిగిందన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకుని మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి రుచికరంగా ఉంటున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సకల సదుపాయాలను వినియోగించుకుంటూ మంచిగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

## సంపాదకీయం

# భాగ్యనగర సౌభాగ్యం నిలిపేదెలా? ..!

చిన్న వర్షం వచ్చినా హైదరాబాద్ రోడ్లు వరదలను తలపిస్తున్నాయి. మామూలు రోజుల్లో ట్రాఫిక్ చిర్రెత్తు కొచ్చేలా చేస్తోంది. ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారుతోంది. వర్షాం వస్తే నరకం కనిపిస్తోంది. హైదరాబాద్ విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లుగా డ్రైనేజీని ఆధునీకరించడం లేదు. అలాగే వానవస్తే నీరు పోయేలా చేయడం లేదు. వేలకోట్ల ఆదాయం వస్తున్నా నగరం అభివృద్ధి విషయంలో పాలకులు శ్రద్ధ వహించడం లేదు. కెసిఆర్ హైదరాబాద్ గురించి కాకమ్మ కబుర్లు ఎన్నో చెప్పారు. హుస్సేన్ సాగర్‌ను కొబ్బరినీళ్లలా తయారు చేస్తానని ప్రగల్బాలు పలికారు. దాదాపు పదేళ్లు అధికారంలో ఉన్నా ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. అయినా ఎలాంటి పురోగతి కానరావడం లేదు. ప్రలను బుజ్జగించే పనులు తప్ప కఠినంగా నగర సుందరీకరణ, ట్రాఫిక్ ఫ్రీ రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్దం కావాలి. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు,దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్చలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వీటి గురించి ఏ పార్టీ వారు కూడా మాట్లాడడం లేదు. మత కట్టడాలను తొలగించడం పాపమనా లేక, పార్టీలకు భయపడో కానీ వాటి జోలికి వెళ్లడం లేదు. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణ, విస్తరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. హైడ్రా కొంతమేర కూల్చివేతలు చేపట్టడం ఆహ్వానించదగ్గదే. అయితే నాలాల ఆక్రమణలను పెద్ద ఎత్తున తొలగించాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి నుంచి బయటపడేలా ప్రణాళికలు సిద్దం చూసుకోవాలి. హైదరాబాద్ రూపు రేఖలు మారబోతున్నాయన్న విశ్వాసం ప్రజల్లో కలగాలి. ప్రజలను కూడా ఇందులో బాధ్యులను, భాగస్వాములను చేయాలి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెప్పడం కాకుండా ప్రణాళికలు సిద్దం చేయాలి. నగరంలో పారిశుద్ధ్య, మురుగు నీటి, తాగునీటి సమస్యలు గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు ఎవరైనా అంగీకరించాల్సిందే. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన డానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడం కలిసి వస్తోంది. అలాగే అన్యక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చేస్తామని సిఎం రేవంత్ పదేపదే ప్రకటించారు. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించు కుంటాయి. ఇకపోతే జిహెచ్‌ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణ సాకారమయితే మరింత సౌకర్యంగా ఉంటుంది. పాత నగరానికి మెట్రో విస్తరణ, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ వంటివన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్ఓ, వీఆర్ఏలను రెవెన్యూశాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్టయ్యింది. అధికార అండతో విలువైన భూములను కాజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో జరిగిన భూ విధ్వంసంపై దృష్టి పెట్టి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడేందుకు హైడ్రా చేస్తున్న కృషికి అందరూ తోడ్పాటు అందించాలి. జీహెచ్‌ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరిం చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున, జీహెచ్‌ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి వచ్చాయి. చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ప్రభుత్వ స్థలాల పరిరక్షించడం, అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో ప్రధాన భూమికను పోషించనుంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు విపత్తుల నిర్వహణలోనూ అది కీలకం. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ, చెరువు, వక్ఫ్, దేవాదాయశాఖ, పార్కులు, ఇనాం భూములు కబ్జాదారుల చెరల్లో ఉన్న విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కబ్జాదారుల బారి నుంచి సర్కారు భూములకు విముక్తి కల్పించడంతోపాటు ఇకముందు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం కోసం హైడ్రా చేపట్టిన పనులను స్వాగతించాలి.ఈ నేపథ్యంలో చెరువులు, కుంటల కబ్జాలపై వచ్చే ఫిర్యాదుల మీద హైడ్రా తక్షణమే స్పందిస్తుంది. హైదరాబాద్ నగరంలో శాటిలైట్ ఉపగ్రహ ఛాయాచిత్రాలతో ప్రభుత్వ రికార్డులను ఆధారంగా చేసుకొని హైడ్రా అధికారులు నీటిపారుదల, రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సర్వే చేసి ఆక్రమిత భూముల వివరాలను వెలికితీసి, అక్రమ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నగరంతో పాటు నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేలా పోలీసులతో సమన్వయం చేయాలి. ప్రధాన రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లపై శాశ్వత ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించాలి. వరద నిర్వహణకు జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బృందాల పనితీరును క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తం చేయాలి. నిర్దిష్టమైన బృహత్ లక్ష్యాలతో సాగితేనే హైదరాబాద్ మంచి నగరంగా రాణించగలదు.

# ప్రగతిరథ చక్రాల తోడుగా మహిళా సాధికారత

"మహిళల శక్తి సమాజ శక్తి. ఆమెకు అవకాశాలు, స్వాతంత్ర్యం ఇవ్వగలిగినప్పుడే రాష్ట్రం, దేశం నిజమైన అభివృద్ధి పథంలో సాగుతుంది." అంటారు ఉక్కు మహిళ, దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ. ఆమె మాటలే స్ఫూర్తిగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళల సాధికారతకు విశేష ప్రాధాన్యం ఇస్తూ, తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణించేలా మహాలక్ష్మి పథకంకు ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే శ్రీకారం చుట్టింది. మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కి కేవలం ఆధార్ కార్డు చూపించి జీరో టికెట్ తీసుకుంటే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. మహిళల ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించే దిశగా తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర పురోగమనానికి ఊతమిస్తున్నాయి. వంటింటికే పరిమితమైన మహిళలు సైతం ఉద్యోగాలు చేసుకుంటూ తమ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మహాలక్ష్మి పథకం మహిళల జీవన ప్రమాణాలను ఉన్నతీకరించడమే కాక, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను మునుపెన్నడూ లేనివిధంగా ఆర్థికంగా బలోపేతం చేస్తూ, సామాజిక చలనశీలతను పెంచుతున్నాయి.





### * మహాలక్ష్మి పథకం: విప్లవాత్మక ఆరంభం

2023 డిసెంబర్ 9న, తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎప్పటికీ గుర్తుండేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకంను ప్రారంభించారు. దాదాపు 19 నెలలుగా ఈ పథకం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకం తెలంగాణలోని మహిళలకు, ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత యాణ సౌకర్యాన్ని అందిస్తుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలలో ఒకటిగా, ఈ పథకం మహిళల సామాజిక, ఆర్థిక చలనశీలతను పెంచడం లక్ష్యంగా ప్రవేశపెట్టబడింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు, హైదరాబాద్‌లో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణం, అంతర్‌రాష్ట్ర బస్సుల్లో రాష్ట్ర సరిహద్దు వరకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. పథకం ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే, బస్ స్టేషన్లలో మహిళల రద్దీ గణనీయంగా పెరిగింది. 2025 జూలై నాటికి, రాష్ట్రవ్యాప్తంగా రూ. 6,700 కోట్ల విలువైన 200 కోట్ల జీరో టికెట్లను టీజీఎస్‌ఆర్టీసీ జారీ చేసింది. మంది మహిళలు ఈ పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించారు, తద్వారా ప్రయాణాల రాయితీని పొందారు. ఈ భారీ రాయితీని ప్రభుత్వం TGSRTCకి రీయంబర్స్‌మెంట్ రూపంలో సకాలంలో చెల్లిస్తూ, రవాణా సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతోంది. ఈ పథకం అమలుకు ముందు బస్సుల్లో సీట్ల భర్తీ నిష్పత్తి (ఆక్యుపెన్సీ రేషియో) 67 శాతంగా ఉండగా, పథకం అమలయ్యాక ప్రస్తుతం 28% పెరిగి 95% కు చేరుకుంది. ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు భారీ స్థాయిలో యోజనం కలుగుతుందనీ చెప్పడానికి పెరిగిన ఆక్యుపెన్సి రేటే నిదర్శనం.

### * ఆర్థిక స్వాతంత్ర్యానికి బాట

మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత బస్సు ప్రయాణమే కాదు. ఇది మహిళల ఆర్థిక సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తోంది. ప్రతి మహిళ నెలకు సగటున రూ. 4,0005,000 ఆదా చేస్తోందని అధికారుల అంచనా. ఈ ఆదాయం మహిళలకు వారి కుటుంబ ఖర్చులను నిర్వహించడానికి, చిన్నపాటి వ్యాపారాలను ప్రారంభించడానికి లేదా విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకు ఉపయోగపడుతోంది. గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు రోజువారీ ఉపాధి కోసం ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఒక వరంగా మారింది. ఉదాహరణకు, హైదరాబాద్‌లోని గృహ కార్మికులు, చిన్న ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులకు ఈ ఉచిత ప్రయాణ సౌకర్యంతో తమ ఆదాయాన్ని గణనీయంగా ఆదా చేసుకుంటున్నారు. మహిళల నుంచి ఆదరణ అంతకంతకూ పెరుగుతుండడంతో ఇప్పటికే పలు జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్ నగరంలోనూ ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెడుతున్నాయి. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో డిమాండ్‌కు అనుగుణంగా కొత్త బస్సులు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

### సక్సెస్... సంబురాలు

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంచనాలకు మించి సక్సెస్ అయ్యింది. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు మేరకు ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా 97 ఆర్టీసీ బస్ డిపోలు, 341 బస్ స్టేషన్లలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా ఉత్తమ డ్రైవర్ లు, కండక్టర్ లను సత్కరించడంతోపాటు ప్రయాణికుల ప్రయాణ అనుభవాల తెలుసుకుని మరింత ప్రభావంతంగా, ప్రయోజనకరంగ పథకం అమలయ్యేలా చూడనున్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, సాధికారతను పెంపొందించడమే కాకుండా, ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది.



మామిండ్ల దశరథం
పౌర సంబంధాల అధికారి,
గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ
సెల్: 9491367478



# అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు రూ.5 లక్షలు

* వచ్చేనెల 15లోగా ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలి
* ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
* వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
* రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ ,వరంగల్ జిల్లా ఇన్-చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ జూలై 26(సమయం న్యూస్) : ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వచ్చే నెల 15వ తేదీలోగా కేటాయించాలని, ఇందుకు అర్హులైన లబ్దిదారుల ఎంపికను వెంటనే చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తిచేసుకోవడానికి ప్రభుత్వమే లబ్దిదారులకు 5 లక్షల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని ప్రకటించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు దరఖాస్తు ఎప్పుడు చేసుకున్నారనేది ముఖ్యం కాదని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడమే ప్రధానమన్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నాకూడా వాటిని పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇసుక, చెల్లింపులు, లబ్దిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రావణ మాసం మొదలైన నేపథ్యంలో త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు కూడా ఉంటాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఫిర్యాదులు, సందేహాలు, సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్యాలయంలో త్వరలో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామని తెలపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సూచనల ప్రకారం శాసనసభ్యులను భాగస్వామ్యం చేసి ప్రతి మండలంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ఇందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం నాడు వరంగల్ నగర అభివృద్ధిపై పంచాయితీరాజ్ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి దేవస్థానం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు, రైల్వే తదితర అంశాలపై సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా చేయాలన్ని సంకల్పంతో పనిచేస్తున్నామని గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. వరంగల్ అభివృద్ధికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డి.పి.ఆర్. టెండర్, పనులు ప్రారంభించడానికి, పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకొని పనిచేయాలని సూచించారు. వరంగల్ ప్రాంత చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని అయితే ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని రెండు రోజుల క్రితం 205 కోట్ల రూపాయిలను విడుదల చేయడం జరిగిందని ఈ భూ సేకరణకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ కు సంబంధించి అక్కడ రాజీవ్ గాంధీ టౌన్ షిప్‌లో ఆర్ & ఆర్ ప్యాకేజీ కింద 1398 మంది లబ్దిదారులను గుర్తించి 863 ప్లాట్ లు కేటాయించడం జరిగిందని తెలపారు. ఈ కాలనీకి సంబంధించి సెప్టెంబర్ నెలాఖరు నాటికి మౌలికసదుపాయాల కల్పన పూర్తికావాలని ఆదేశించారు. అలాగే వెటర్నరీ హాస్పిటల్, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయితీ కార్యాలయ భవనం నిర్మించాలని, మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూ. 4170 కోట్లతో 2057 జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని పనులను వీలైనంత త్వరగా ప్రారంభించడానికి వీలుగా పనులను విభజించుకొని దశల వారీగా చేపట్టాలని సూచించారు. భద్రకాళి ఆలయ మాడవీధులతోపాటు కల్యాణ మండపం, పూజారి నివాసం , విద్యుత్ అలంకరణలను వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తెచ్చేవిధంగా ప్రణాళికను రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు తానే స్వయంగా వస్తానని చెప్పారు. రోప్‌వే, గ్లాస్‌బ్రిడ్జి తో సహా అన్ని పనులు వచ్చే డిసెంబర్ కల్లా పూర్తిచేయాలన్నారు. భద్రకాళి చెరువు ప్రాంతంలో ఇంతవరకు 3.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించామని, 2.06 కోట్ల రూపాయిల మట్టిని విక్రయించామని అధికారులు తెలిపారు. ఈ వర్షాకాలం పూర్తయిన వెంటనే ఈ చెరువు మట్టిని తరలించాలని మంత్రి గారు సూచించారు. ఆలయంలో యంత్రాల సాయంతో భోజన తయారీ కార్యక్రమాన్ని చేపడతామని దీనికి తగ్గట్టుగా నిర్మాణాలు చేయాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ప్రకటనకు అనుగుణంగా వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియానికి అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. హాస్టల్ లో విధ్యార్థులకు, హాస్పిటల్ లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూడడానికి మండలానికి సంబంధించిన ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు శ్రీ బలరాం నాయిక్, శాసన సభ్యులు శ్రీ కడియం శ్రీహరి, శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి, , శ్రీ కె.నాగరాజు, శ్రీ గండ్ర సత్యనారాయణ, నాయని రాజేందర్, శాసనమండలి సభ్యులు శ్రీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్రీ బస్వరాజు సారయ్య, శ్రీ అంజిరెడ్డి, శ్రీ బండ ప్రకాష్, వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి వివిధ శాఖలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు నిత్యావసర వస్తువుల పంపిణీ అందించిన

# రోటరీ క్లబ్ వరంగల్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్

సమయం న్యూస్, పర్వతగిరి : పర్వతగిరి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 20 మంది తల్లి గాని తండ్రి గాని లేని విద్యార్థులకు సుమారు 85 వేల విలువగల నిత్యాసర వస్తువులను రోటరీ క్లబ్ వరంగల్ ప్రెసిడెంట్ శివప్రసాద్ గారి సహకారంతోపంపిణీ చేయడం జరిగింది. దీనిలో భాగంగా విద్యార్థులకు డ్రెస్సులు, యోగ మ్యాట్, స్టడీ చైర్, వాటర్ బాటిల్స్, ఎగ్జామ్ పాడ్స్, డిక్షనరీలు పెన్సిల్ బాక్స్, టార్చ్ లైట్స్, పెన్స్, నోట్ బుక్స్, లగేజ్ బ్యాగ్స్, రైటింగ్ పాడ్స్, టవల్స్ అండ్ కర్ చిప్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపులింగారెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థుల కొరకు రోటరీ క్లబ్ వరంగల్ వారు చేస్తున్న విశిష్ట సహకారాన్ని అభినందించారు విద్యార్థినిలు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను వివరించారు. విద్యార్థినిలు ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కోవాలని



ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఎంఈఓ గాయపు లింగారెడ్డి గారు, రొటేరియన్ ప్రెసిడెంట్ కె. శివప్రసాద్ సార్ గారు మరియు మేడం గారు, రొటేరియన్ సెక్రటరీ జి ఎల్లారాజు సార్ గారు, రొటేరియన్ డి నరసింహారావు సార్ గారు, రొటేరియన్ శ్రీకాంత్ సార్ గారు, జిల్లా కాంగ్రెస్ లీడర్ పి అనిల్ రావు గారు, జి జయరాజ్ సార్ గారు, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నజియాసల్మా గారు పాల్గొన్నారు. సమయం న్యూస్, వరంగల్

: పర్వతగిరి. పర్వతగిరి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 20 మంది తల్లి గాని తండ్రి గాని లేని విద్యార్థులకు సుమారు 85 వేల విలువగల నిత్యాసర వస్తువులను రోటరీ క్లబ్ వరంగల్ ప్రెసిడెంట్ శివప్రసాద్ గారి సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. దీనిలో భాగంగా విద్యార్థులకు డ్రెస్సులు, యోగ మ్యాట్, స్టడీ చైర్, వాటర్ బాటిల్స్, ఎగ్జామ్ పాడ్స్, డిక్షనరీలు పెన్సిల్ బాక్స్, టార్చ్ లైట్స్, పెన్స్, నోట్ బుక్స్, లగేజ్ బ్యాగ్స్, రైటింగ్ పాడ్స్, టవల్స్ అండ్ కర్ చిప్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపులింగారెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థుల కొరకు రోటరీ క్లబ్ వరంగల్ వారు చేస్తున్న విశిష్ట సహకారాన్ని అభినందించారు విద్యార్థినిలు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను వివరించారు. విద్యార్థినిలు ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కోవాలని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఎంఈఓ గాయపు లింగారెడ్డి గారు, రొటేరియన్ ప్రెసిడెంట్ కె. శివప్రసాద్ సార్ గారు మరియు మేడం గారు, రొటేరియన్ సెక్రటరీ జి ఎల్లారాజు సార్ గారు, రొటేరియన్ డి నరసింహారావు సార్ గారు, రొటేరియన్ శ్రీకాంత్ సార్ గారు, జిల్లా కాంగ్రెస్ లీడర్ పి అనిల్ రావు గారు, జి జయరాజ్ సార్ గారు, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నజియాసల్మా గారు పాల్గొన్నారు.

## అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కంగ్టి, 26 జులై, (సమయం న్యూస్) : సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కంగ్టి పోలీస్ స్టేషన్ కంగ్టి మండలం మరియు పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో,ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించగలని కంగ్టి ఎస్సై దుర్గారెడ్డి అన్నారు.శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల సమయంలో ఎవరూ నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న వాగులు, వంకలు, చెరువులు మరియు లోతైన ప్రాంతాలకు వెళ్లకండి.విద్యుత్ తీగలు తెగి పడే అవకాశమున్నందున,వాటికి దూరంగా ఉండండి. ఏదైనా ప్రమాదకర పరిస్థితి కనిపించినట్లయితే వెంటనే 100 నంబరుకు సమాచారం ఇవ్వండి. పిల్లలను బయటకు పంప కుండా ఇంటి వద్దే ఉంచండి. ఆటల




కోసం నీటి ప్రాంతాలకు వెళ్లకుండా చూడండి.దిగువ స్థాయిలో ఉన్న ప్రాంతాలలో నివసించే వారు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే ఏర్పాట్లు చేసుకోవాలి. అవసరమైతే పోలీస్ స్టేషన్ లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించండి. సహాయానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాము అని అన్నారు.

## టాటా సంస్థ ఆధ్వర్యంలో పటాన్ చెరు ఐటిఐ లో నూతన కోర్సులు

- **అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా ప్రభుత్వ ఐటిఐలు**
- **ప్రముఖ పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు, క్యాంపస్ ప్లేస్మెంట్లు**
- **పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరు(రామచంద్రాపురం), జూలై 26, సమయం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను టాటా సంస్థ సహకారంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతుం దని, ఆధునిక పారిశ్రామిక రంగానికి అనుగుణంగా నూతన కోర్సులు ప్రారంభించడంతోపాటు ప్రాంగణ నియామకాల ద్వారా, ప్రముఖ పరి శ్రమలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం డివిజన్ పరిధిలోని పటాన్ చెరు ఐటిఐ ప్రాంగణంలో నూతన కోర్సులకు సంబంధించిన బ్రోచర్ ను శనివారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఐటిఐ ఆవరణలో టాటా సంస్థ ఆధ్వ ర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటిఐ తో పాటు ఏటీసీ లో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద పరిశ్రమిక వాడగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గంలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఆయా పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో ఐటిఐ తో పాటు ఏటీసీ సెంటర్లు శిక్షణ కేంద్రాలకు ఉపయోగపడతాయని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటిఐ,ఏటీసీ సెంటర్లలో శిక్షణ అందించడం ద్వారా వారిని నిపుణులైన ఉద్యోగులుగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని తెలిపారు.టాటా సంస్థ తమ సామాజిక బాధ్యతలో భాగంగా 42 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 10 వేల అడుగుల విస్తీర్ణంలో ఆధునిక యంత్ర సామాగ్రితో శిక్షణ కేంద్రాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు.రాబోయే ఐదు సంవత్సరాల పాటు టాటా సంస్థ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుందని తెలిపారు. ప్రధా నంగా ప్రస్తుత మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆరు కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకుని వచ్చారని తెలిపారు.ఎలక్ట్రికల్ వెహికల్ (ఈవి) రిపేరింగ్, అడ్వాన్స్ సిఎంసి మిషన్, ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్



రోబోటిక్, ఆర్టిసియన్ యూజ్ అడ్వాన్స్ టూల్స్ కోర్స్, బేసిక్ డిజైన్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ కోర్స్, వడ్డువేరు ఉత్పత్తుల రంగంలో ఉండే వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు మరమ్మతులు అంశాల్లో కోర్సులు ప్రవేశపెట్టారని తెలిపారు. పదవ తరగతి పాసైన ప్రతి విద్యార్థి ఈ కోర్సులు చేయడానికి అర్హులని తెలిపారు. ప్రతి సంవత్సరం పైన పేర్కొన 6 కోర్సుల్లో 240 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. ఐటిఐ తో పాటు ఇప్పటికే పటాన్ చెరు పటంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతుల సైతం ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బంగారు భవితకు బాటలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇక నుండి ప్రతి సంవత్సరం టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఐటిఐ ప్రాంగణంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని,అతి త్వరలో ప్రతి సమస్యను పరిష్కరించి రాష్ట్రంలోని ఆదర్శ ఐటిఐగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, రామచంద్రపురం కార్పోరేటర్ పుష్ప నగేష్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, దశరథ్ రెడ్డి, టీజీఐఐసి జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వీర మల్లేష్,పరమేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్,ఐలేష్, తదితరులు పాల్గొన్నారు.




## భూ బదిలీ వేగవంతానికి GHMC రక్షణ శాఖల కీలక సమావేశం

హైదరాబాద్, జులై 26 (సమయం న్యూస్)., 2025: హెచ్ సిటీ ద్వారా AOC సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం కోసం ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (AOC) సెంటర్లోని రక్షణ శాఖ భూములను బదిలీ చేయడంపై చర్చించడానికి, కమిషనర్ RV కర్ణన్ శనివారం GHMC ప్రధాన కార్యాలయంలో ల్యాండ్ లీగల్ డైరెక్టర్ బ్రిగేడియర్ S.K. చెట్టి నేతృత్వంలో రక్షణ అధికారులతో ఉన్నత స్థాయి సమన్వయసమావేశం నిర్వహించారు. కీలకమైన మౌలిక సదుపాయాల హెచ్ సిటీ ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ₹960.00 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియలు త్వరలో ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టుకు అవసరమైన 42.20 ఎకరాల భూ బదిలీ ప్రక్రియ వేగిరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రభావిత రక్షణ భూమికి బదులుగా సమాన విలువ గల భూమినీ. ఇవ్వాలని రక్షణ శాఖ అధికారులు కమిషనర్ ను కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ జోన్, చుట్టుపక్కల ప్రయాణికులకు రద్దీని తగ్గించడానికి కనెక్టివిటీని పెంచడానికి ఈ ప్రాజెక్ట్ దోహదం చేస్తుందని కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. రక్షణ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ, ప్రత్యామ్నాయ రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయడంపై దృష్టి పెట్టామని GHMC కమిషనర్ తెలిపారు. ఈ వ్యూహాత్మక రోడ్డు నెట్వర్క్ సాయుధ దళాల కార్యాచరణ అవసరాలను కొనసాగిస్తూ, ముఖ్యంగా సున్నితమైన రక్షణ నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో పౌర ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించనుంది. చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) భాస్కర్ రెడ్డి, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ రావు మరియు GHMC నుండి డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ భూసేకరణ రామ్ నాయక్ ప్రాజెక్టు ఈ ఈ రోహిణి, AOC సెంటర్ నుండి స్టాఫ్ ఆఫీసర్ ల్యాండ్ అండ్ లీగల్ విజు సుందరేశ నయాబ్ సుబేదార్ షబ్బీర్ ఖాన్ పాటు హాజరైన కీలక అధికారులు ఉన్నారు.

## నాన్ రెసిడెన్షియల్ ప్రాపర్టీ దారులందరికీ

# ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికేట్ జారీ, ఫీజు వసూలు బాధ్యత డిప్యూటీ కమిషనర్ లదే

- **వారంలో ఒకరోజు కోర్టు ధిక్కరణ కేసుల పురోగతిపై ZC లు సమీక్షించాలి**
- **ఆస్తి పన్ను వసూలు లక్ష్యం సాధించాలి: కమిషనర్ ఆర్ వి కర్ణన్**




హైదరాబాద్, జులై 26(సమయం న్యూస్) : నాన్ - రెసిడెన్షియల్ ప్రాపర్టీ, ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ జారీ తో పాటు ఫీజు వసూలు బాధ్యత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లదే అని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ తేల్చి చెప్పారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆస్తిపన్ను వసూలు, ట్రేడ్ లైసెన్స్, పెండింగ్ కేసుల పై కమీషనర్ ఆర్.వి.కర్ణన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 3.5 లక్షల నాన్ - రెసిడెన్షియల్ ప్రాపర్టీ లు ఉన్నాయన్నారు. అన్ని నాన్ - రెసిడెన్షియల్ ప్రాపర్టీ లకు ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలన్నారు. ప్రతి వారం జోనల్ కమీషనర్లు తమ పరిధిలో ఎన్ని నాన్ రెసిడెన్షియల్ ప్రాపర్టీ లు ఉన్నాయి, ఎన్నింటికి ట్రేడ్ లైసెన్స్ జారీ పన్ను వసూలు పురోగతిని తెలిపే వివరాలు అందించాలన్నారు. నాన్ రెసిడెన్షియల్ ప్రాపర్టీ దారులు అందరూ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలన్నారు. గత సంవత్సరం జులై నెలలో ఆస్తి పన్ను లక్ష్యం సాధింపులకు అనుగుణంగా ఈ నెలలో కూడా అంతకు తగ్గకుండా ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. టాక్స్ వసూలు ద్వారానే ఉద్యోగులు నెలసరి వేతనాలు తో పాటుగా మౌలికసదుపాయాలు కల్పించడం జరుగుతున్నా నేఒస్థ్యంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు చేయాల్సిందే నాని అందుకు డిప్యూటీ కమిషనర్లు బాధ్యత అన్నారు. ఇదే సమావేశంలో అన్ని రకాల కోర్టు కమిషనర్ జోనల్ కమిషనర్ లు, డిప్యూటీ కమిషనర్ లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సమీక్ష నిర్వహించారు. అన్ని రకాల కోర్టు కేసులను త్వరగా క్లియర్ చేసేందుకు జోనల్ స్థాయిలో వారంలో ఒకరోజు తప్పనిసరిగా సమీక్షించాలని జహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ జోనల్ కమిషనర్ లను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో కోర్టు కేసుల పరిష్కారంపై డిప్యూటీ కమిషనర్ లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. హైకోర్టు జారీ చేసిన పెండింగ్ ఆదేశాలను సమీక్షించి, నిర్ణీత సమయంలోపు ఆదేశాలను పాటించేలా వివరణ ఇవ్వాలని చెప్పారు. నిర్దేశిత సమయంలోగా కౌంటర్ అఫిడవిట్ ను దాఖలు చేయాలన్నారు. USSR నంబర్ను లీగల్ కేస్ మాడ్యూల్ లో అప్లోడ్ చేయాలి. జీహెచ్ఎంసీ అధికారులు,సిబ్బందిపై దాడులను సహించం. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందిపై దాడులు ఉపేక్షించమని కమిషనర్ ఆర్ వి స్పష్టం చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీ ప్రధాన రహదారిపై రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేస్తున్న వ్యక్తినీ ప్రశ్నించిన జీహెచ్ఎంసీ టౌన్ప్లానింగ్ సిబ్బందిపై కత్తితో దాడికి యత్నించిన ఘటన పై సమావేశంలో కమిషనర్ ఆరా తీశారు. జూబ్లీ హిల్స్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఘటన వివరాలు కమిషనర్ కు తెలిపారు. దాడికి యత్నించిన వ్యక్తి పై ఫిలిం నగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశామని చెప్పారు. పోలీసులు ఆ వ్యక్తినీ అరెస్ట్ కూడా చేశారని తెలిపారు. బాధ్యుల కు శిక్ష పడేలా కేసును ఫాలో అప్ చేయాలన్నారు. ఎవరైనా బెదిరింపు ఘటనలు పాల్పడితే తమ దృష్టికి తేవాలన్నారు. జీహెచ్ఎంసీ స్టాఫ్ దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (లీగల్) సత్యనారాయణ, జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, భోర్ఖడే హేమంత్ సహదేవరావు, రవి కిరణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**అదనపు కమిషనర్ (హెల్త్) సీ.ఎన్. రఘు ప్రసాద్**

**–సనత్ నగర్ లో రెండు డెంగ్యూ కేసులు.. అప్రమత్తమైన బల్దియా అధికారులు**

హైదరాబాద్, జులై26(సమయం న్యూస్).: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో డెంగ్యూ వ్యాధి నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ (హెల్త్) సీ.ఎన్. రఘు ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సనత్ నగర్ లో ఇద్దరు వ్యక్తులకు డెంగ్యూపాజిటివ్ రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ (హెల్త్) సీ.ఎన్. రఘు ప్రసాద్ శనివారం సనత్ నగర్ లో డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన కాలనీలో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటన పర్యటించారు. సనత్నగర్ బస్టాండ్ సమీపంలోని SRT కాలనీలో డెంగ్యూ బాధితులతో రఘు ప్రసాద్ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులు నమోదైన కాలనీ లలో జ్వరపీడుతులు, అనుమానితులకు డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్యాధికారులు,సిబ్బందికి సూచించారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను ఎదుర్కోవడానికి, జీఎచ్ఎంసి ఎంటమాలజీ బృందాలు అవగాహన డ్రైవ్లు, యాంటీలార్వా ఆపరేషన్లు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. దోమలు సంతానోత్పత్తి ప్రదేశాలను గుర్తించడంతో పాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. స్లమ్స్, స్కూళ్లు, హాస్టళ్లలో యాంటీ లార్వల్ ఆపరేషన్స్ను ఉద్ధృతం చేయాలన్నారు. ఇంటి లోపల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలనీ ప్రజలకు అదనపు కమిషనర్ సూచించారు.హెల్త్ జాయింట్ కమిషనర్ శంకర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ చంద్ర శేఖర్ రెడ్డి, హెల్త్, మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక





# ఎందుకింత అద్వాన్నమైన రోడ్లు ?

- మరమ్మత్తులు చేయించకుంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడి చేస్తాం
- ఇంద్రేశంలో రోడ్డు దుస్థితి రోడ్డుపై వరి నాట్లు
- భాజపా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి




పటాన్ చెరు,జూలై 26, సమయం న్యూస్ : పటాన్చెరు రింగ్ రోడ్డు నుండి ఇంద్రేశం, దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు ఎందుకింత అద్వాన్నంగా ఉందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ప్రశ్నించారు. శనివారం పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో మండల బిజెపి నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి మెరుపు సమ్మె నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఇంద్రేశంలో రోడ్డుపై పూర్తిగా బురద తో నిండిపోయినందున రోడ్డుపైన వరినాట్లు వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ గడచిన 12 సంవత్సరాల నుండి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారంలో ఉన్నప్పటికీ ఈ ముఖ్యమైన రోడ్డును ఎందుకు నిర్మించడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పటాన్చెరువుకు కూతవేటు దూరంలో ఉన్న ఇంద్రేశం రోడ్డు ఇంత అద్వాన్నంగా ఉండడానికి కారణమేమని ఆమె ప్రశ్నించారు. ఈ రోడ్డుపై క్రషర్ల నుంచి వచ్చే భారీ వాహనాలతో రోడ్లు పాడవుతున్నాయని, అట్టి వాహనాలను నియంత్రించాలని ఆమె డిమాండ్ చేశారు. పటాన్ చెరు నుండి జిన్నారం, దౌల్తాబాద్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆటో డ్రైవర్లకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని ఆమె అన్నారు. ఆటోవాలాలు రోజు సంపాదించే డబ్బులు ఆటోల రిపేరుకు కూడా సరి పోవడం లేదని ఆమె తెలిపారు. కాంగ్రెస్ హయంలో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. సకాలంలో రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాప్ రెడ్డి,జిల్లా నాయకులు అల్లం అంజి రెడ్డి, పటాన్ చెరు, జిన్నారం మండల అధ్యక్షులు కావలి వీరేశం, జగన్ రెడ్డి ,మండల నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో బాలికలను ప్రోత్సహిద్దాం

* మహిళలని ఛాంపియన్లుగా ప్రోత్సహిద్దాం
* తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి
* అస్మిత - ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ 2025-26ప్రారంభం




హైదరాబాద్ జులై26(సమయం న్యూస్) : క్రీడల్లో బాలికలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. ఈరోజు ఎల్ బి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఖేలో ఇండియా అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025 26ను ఆయన ముఖ్య అతిథి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిక్ బాక్సింగ్ క్రీడా కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాకుండా ఆత్మ రక్షణకు ఆత్మస్థైర్యానికి ఉపయోగ పడుతుందని ఇటువంటి క్రీడలలో విద్యార్థినీలను బాలికలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహక విధానాల వల్ల అనేక క్రీడా పోటీలు తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించుకోవడం జరుగుతుందని, అదేవిధంగా పలు జాతీయ అంతర్జాతీయ పోటీలకు మన రాష్ట్ర క్రీడాకారులు ఎంపిక అవుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్రీడా విధానంలో క్రీడల్లో బహుముఖంగా ప్రోత్సహించే విధంగా పటిష్టమైన నిబంధనలు రూపొందించమని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఏ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, గత ఆరు నెలల్లోనే ఖేలో ఇండియా "అస్మిత" రోయింగ్ ఫుట్ బాల్ పోటీలు నిర్వహించుకున్నామని అదేవిధంగా కిక్ బాక్సింగ్ పోటీలను కూడా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. 18 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం ఇందుకు స్పోర్ట్స్ అథారిటీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు కార్యదర్శి మహిపాల్ ఉపాధ్యక్షులు బాలాజీ కోశాధికారి పి. శ్రీనివాస్ సహాయ కార్యదర్శి నరసింగరావు, శేఖర్ ,భాగ్యరాజ్ ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవసారి మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్లూరి హనుమంతరావు

శివ్వంపేట జులై 26 (సమయం న్యూస్) : తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివంపేట మండలం ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కల్లూరి హనుమంతరావు ఎన్నికయ్యారు. గత ఐదారు సంవత్సరాలుగా హనుమంతరావు మున్నూరు కాపు సంఘం యొక్క అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. అందులో భాగంగానే గ్రామీణ స్థాయిలో కులస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన ప్రత్యేక దృష్టిసారించి వారి సమస్యలను అడిగి వాటి పరిష్కారానికి కృషి చేశారు. అంతేకాకుండా నిరు పేదలకు పుస్తే మట్టేలు పంపిణీ చేయడం ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. హనుమంతరావు సేవలను గుర్తించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు



సర్దార్ పుట్టం పురుషోత్తమరావు, సంఘం గౌరవ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర లు



MUNNURU KAPU SANGAM TELANGANA
Regd. No. 873 / 2021
Plot No. 22, Road No.2, TNGOS Colony, Gachibowli, Serilingampally, R.R.Dist Telangana State. Cell: 9963994779, 9010105469

Sri. ...DIRAJU RAVICHANDRA, M.P. Hon. President | SARDAR PUTAM PURUSHOTHAM RAO PATEL President

General Secretary Peddi Pentaiah Patel
Treas... Kanci... ...yanarayana Patel
Working President's Dr. J.N. Venkat Patel, Challa Hari Shankar Patel, Bukka Venu Gopal

నియామక ధృవ పత్రం

శ్రీ కల్లూరి హనుమంత రావు పటేల్ తండ్రి : ముత్యాలు
చిరునామా : ఇ.నెం. 10-19, ఎదులపూర్, శివంపేట్ మండలం, మెదక్ జిల్లా గారిని
మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు
గా నియామకం చేస్తూ తేది : 25-07-2025 ఉత్తర్వులు జారీ చేయనైనది.

ఈ ఉత్తర్వులు పై తేది నుండి అమలులోకి వస్తాయి. తమరు మున్నూరు కాపు సంఘం తెలంగాణ , సంఘం నియమ నిబంధనలకు, రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ మున్నూరు కాపుల సంక్షేమం ఐక్యత గురించి పాటు పడుతూ సమాజంలోని బహుజన కులాలతో సఖ్యతగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నాను.

తమ అభివృద్ధిని ఆకాంక్షించే

(సర్దార్ పుటం పురుషోత్తమ రావు పటేల్) అధ్యక్షులు

కల్లూరి హనుమంతరావును, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ

శనివారం వేములవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేహెచ్ ఆర్ కు నియామక పత్రం అందజేసీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంకే సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మరోసారి ఎన్నికైన కల్లూరి హనుమంతరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సంఘం బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని, రాష్ట్ర సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పని చేస్తానని, కమిటీ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటానన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి కార్యవర్గ సభ్యులందరికీ హనుమంతరావు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఫెడరేషన్ ఐఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షునిగా కొల్కూరి నరసింహారెడ్డి

* అఖిల భారత ఐఎన్టియుసి అధ్యక్షులు మాజీ కార్మిక శాఖ మంత్రి డా జి సంజీవ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం



21 జులై నాడు డిల్లి లో జరిగిన అఖిల భారత ఐఎన్టియుసి వర్కింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం నాడు హైదరాబాదు లోని అఖిల భారత ఐఎన్టియుసి అధ్యక్షులు డా జి సంజీవ రెడ్డి గారి చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఫెడరేషన్ అధ్యక్షులుగా పటాన్ చేరు నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు కోల్కురి నరసింహారెడ్డి నియామకం జరిగింది ఈ సందర్భంగా కోల్కురి నరసింహారెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సంగారెడ్డి జిల్లా లో ప్రైవేటు పరిశ్రమలలో పనిచేసే సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల కొరకు రాజి లేని పోరాటం చేస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 26 లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని వారి శ్రేయస్సు కొరకు వారి సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి, జిల్లా మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ మరియు అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి వారి హక్కులను,పథకాలను అందే విధంగా చూస్తామని అన్నారు.నా నియామకానికి సహకరించిన భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ సి కుంతియా , అఖిల భారత ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు జి సత్యజిత్ రెడ్డి , రాష్ట్ర ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి ఆర్ డి చంద్రశేఖర్, రాష్ట్ర ఐఎన్టియుసి కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, భూపాల్ రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ గ్రేటర్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిల్, షరీఫ్, రాష్ట్ర ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, డక్కన్ క్రానికల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ఆటో కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, ఆర్టీసీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజి రెడ్డి, అబ్రహం, మెదక్ జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, పటాన్ చేరు నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు మెరుగు రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వికసించిన బ్రహ్మ కమలం



పటాన్ చెరు(జిన్నారం),జూలై 26, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ మద్దూరి మమత పెంటేష్ స్వగృహములో శనివారం బ్రహ్మ కమలం వికసించింది. ఈసందర్భంగా వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ పువ్వును చూడడానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు విచ్చేస్తున్నారు. సాధారణంగా హిమాలయ పర్వత ప్రాంతంలో, ఉత్తర ప్రదేశ్, ఉత్తర బర్మా టిబెట్ ప్రాంతాలలో మాత్రమే వికసించే బ్రహ్మ కమలం, గడ్డపోతారం గ్రామంలో వికసించడంతో మద్దూరి పెంటేష్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పురాణాల ప్రకారం బ్రహ్మ కమలంపై బ్రహ్మదేవుడు కొలువై ఉంటాడని నమ్మకం కలదు. ఆయుర్వేదికంగా కూడా బ్రహ్మ కమలానికి మంచి గుర్తింపు కలదు. పక్షవాతానికి, మెదడు సంబంధిత వ్యాధులకు బ్రహ్మ కమలం యొక్క ఆకులు, కాండం యొక్క పొడిని మందులుగా ఉపయోగిస్తారని నానుడి.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

* గుమ్మడిదల ఎస్సైని కలిసిన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

పటాన్ చెరు(గుమ్మడిదల),జూలై 26. సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్ స్టేషన్ కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై లక్ష్మీ కాంత్ రెడ్డిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డిని శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, భాస్కర్, రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సూర్యనారాయణ, బీరప్ప, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# సబ్సిడీ యూరియాను వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలి

* జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.




నల్గొండ జులై 26(సమయం న్యూస్) : సబ్సిడీ యూరియాను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు వాడినట్లయితే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు సంయుక్తంగా హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టర్, ఎస్పీలు నల్గొండ జిల్లా , హైదరాబాద్విజయవాడ రహదారిపై వెలిమినేడ్ వద్ద ఉన్న యాడ్ బ్లూ, డి ఇ ఎఫ్ సేల్ కౌంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ డిఇఎఫ్ లో కలుపుతున్న యూరియా ఎలా వస్తుందో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సబ్సిడీ యూరియాను వ్యవసాయ పనులకు మాత్రమే వాడాలని,అలా కాకుండా ఇతర పనులకు వాడవద్దని, ఇండస్ట్రీలకు ఇండస్ట్రీ యూరియానే వాడాలని అన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవ కేంద్రాల ద్వారా అమ్ముతున్న ఎరువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఎరువులను ప్రత్యేకించి యూరియాను దారి మళ్లిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ సబ్సిడీ యూరియాను రైతులు మాత్రమే వాడాలని, అలా కాకుండా పరిశ్రమలకు మళ్లించకూడదని,ఏదైనా పరిశ్రమ సబ్సిడీ యూరియాను వాడితే చట్ట పరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . యూరియాను వాడే అనుమానాస్పద ఇండస్ట్రీలన్నింటిపై పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఇండస్ట్రియల్ యూరియా కాకుండా, సబ్సిడీ యూరియాను వాడినట్లయితే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల విషయంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారని, అంతేకాక చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా చిట్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల స్టాకును పరిశీలించారు. రికార్డులన్నిటిని సక్రమంగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితులలో ఎరువులు దుర్వినియోగం కారాదని, ఒకవేళ అలా జరిగితే సంబంధిత సీఈఓ లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, చిట్యాల తహసిల్దార్ కృష్ణ,మండల వ్యవసాయ అధికారి గిరిబాబు, తదితరులు ఉన్నారూ.

# చేనేత రంగంలో తెలంగాణది ప్రత్యేక స్థానం: మంత్రి తుమ్మల

హైదరాబాద్: మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేశించారు. చేనేత, జౌళిశాఖ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేనేత రంగంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందన్న తుమ్మల.. రాష్ట్రానికి చెందిన వివిధ రకాల చేనేత వస్త్రాలను జాతీయ చేనేత దినోత్సవం రోజు ఏర్పాటు చేసే ప్రదర్శనలో ఆయా సంఘాల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యతతో వస్త్రాలను ఉత్పత్తి



చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేనేత రుణ మాఫీ పథకం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి.. ఖాతాల్లో నిధులు జమచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నేతన్న పొదుపు, భరోసా పథకాలను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది: ఎంపీ రఘునందన్‌రావు

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. తెలంగాణ నుంచి ఇద్దరికి కేంద్రమంత్రి పదవులు దక్కాయని, వారిలో ఒకరు బీసీ నేతని గుర్తు చేశారు. బీజీ రిజర్వేషన్లపై చర్చించేందుకు ఎక్కడికైనా వస్తానన్నారు. ‘‘ బీసీలు 56 శాతం ఉంటే.. ముగ్గురికే రాష్ట్ర మంత్రి పదవులు ఇచ్చారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గం పునర్‌వ్యవస్థీకరణ చేయాలి. కేటీఆర్, ఎంపీ సి.ఎం.రమేశ్ అంశంపై పార్టీలో చర్చిస్తాం. హెచ్‌సీయూ భూముల అంశంలో కేటీఆర్ బట్టకాల్చి మాపై వేశారు. నాపై, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు చేశారు’’ అని రఘునందన్‌రావు అన్నారు.



## రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే ‘తెలంగాణ జాగృతి’ ఊరుకోదు

**: కవిత**

కుత్బుల్లాపూర్: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన ‘లీడర్’ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని అన్నారు. మన సంప్రదాయాలు, కట్టుబాట్లపై అవగాహన కల్పించుకోవడమే లీడర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ‘‘ఎప్పుడూ కొత్తగా ఉంటేనే సంస్థలు బతుకుతాయి. తల్లి గర్భంలో నుంచి ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడవుతాడు తప్ప.. మూస పద్ధతిలో కొనసాగేవాడు నాయకుడు కాలేడు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11 స్థానంలో ఉందని ఓ సర్వేలో తేలింది. తోటివారి గోప్యతకు, మర్యాదకు భంగం వాటిల్లకుండా పదునైన విమర్శలు చేయడం నేర్చుకోండి.




పక్కవాడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థం. మహాత్మాగాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యేగానో, ఎంపీగానో లేరు. కానీ, ఇప్పటికీ ఆయన్ని గుర్తు చేసుకుంటాం. తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరీకి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉంది. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతీ మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిది. తెలంగాణ జాతికి అద్భుతమైన నేపథ్యం ఉంది. దానిని పరిరక్షించేందుకే ‘జాగృతి’ పని చేస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో యాసను అవహేళన చేసిన ఓ వ్యక్తికి నంది అవార్డు ఇవ్వడాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా, ఎంత పెద్ద సమస్య అయినా ఎదురొడ్డి నిలిచిన సంస్థ ఇది. తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పని చేశాం. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరకోబోదు’’ అని కవిత అన్నారు.

## ఉపాధ్యాయుల పదోన్నతులకు తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా

హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించిన దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు రానున్నాయి. దీనికి సంబంధించి రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌లుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది సుమారు 1500 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఈమేరకు పదోన్నతి ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల మల్టీజోన్‌2లో మిగిలిపోయినవి, పదవీ విరమణ వల్ల సుమారు 750 గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి వీటిని భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యాయులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫైల్ క్లియర్ అయ్యింది. పదోన్నతులతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్



పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయనున్నారు. అదేవిధంగా డీఎస్సీ 2012 తర్వాత పీఈటీ, భాష పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ఇలా దాదాపు 2 వేల మంది పదోన్నతులు పొందే అవకాశం ఉంది. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను ఆధారంగా తీసుకుని ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేకపోవడం వల్ల.. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఇతర పార్టీల్లో విలీనమయ్యే ప్రసక్తే లేదు: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ ప్రజల కోసం పుట్టి, పోరాడిన భారాస రాష్ట్ర సమితి ఇప్పుడే కాదు.. ఎప్పటికీ ఏ ఇతర పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆ విషయం తెలంగాణ ప్రజలకు కూడా తెలుసన్నారు. ఇరకాటంలో పడిన ప్రతిసారీ కాంగ్రెస్, భాజపా నేతలు ఈ పనికిరాని చెత్త అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి, రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆక్షేపించారు. ఎంపీ సి.ఎం. రమేశ్, ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి ఇద్దరూ కలిసి వస్తే.. హెచ్‌సీయూ రూ.10 వేల కోట్ల కుంభకోణంపైనా, రూ.1660 కోట్ల రోడ్ కాంట్రాక్ట్ స్కామ్ పైనా కలిసి చర్చిద్దామని సవాల్ విసిరారు. సి.ఎం. రమేశ్ చేసిన ఆరోపణలపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ సి.ఎం. రమేశ్‌ల బాగోతాన్ని తాను బయట పెట్టడంతో ఏం చేయాలో తోచక ఇద్దరూ సతమతమవుతున్నారని వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో 2026 తర్వాత డీలిమిటేషన్ తప్పదు: మాజీ ఎంపీ వినోద్ కుమార్

తెలంగాణలో 2026 తర్వాత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తప్పదని, శాసనసభ సీట్ల పెంపకం జరుగుతుందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సుప్రీంకోర్టు తీర్పు, డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ చట్టంపై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం శాసనసభ సీట్లను పెంచాలని కోరుతూ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరగదేమోననే అనుమానాలను వినోద్ కుమార్ నివృత్తి చేశారు. సుప్రీంకోర్టు తన తీర్పులో సెక్షన్ 26ను ఆర్టికల్ 170, సబ్‌క్లాజ్ 3కి లోబడి చూసిందని ఆయన వివరించారు. ఆర్టికల్ 170, సబ్‌క్లాజ్ 3 ప్రకారం 2026 తర్వాత జరిగే జనగణన (సెన్సస్) ఆధారంగానే డీలిమిటేషన్ జరగాలని రాజ్యాంగంలో ఉందని గుర్తు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో సీట్ల పెంపుదల, తెలుగు రాష్ట్రాల్లో పెంపుదల లేకపోవడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జమ్మూకాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం కాబట్టి ఆర్టికల్ 170 వర్తించదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 26లో సబ్జెక్టు టూ అనే పదం చేర్చడం వల్లే ఈ సమస్య తలెత్తిందని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. దీనికి బదులుగా నాట్ విత్ స్టాండింగ్ అనే పదం ఉండి ఉంటే రాజ్యాంగ సవరణ అవసరం లేకుండానే సీట్ల పెంపుదల జరిగేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ప్రకారం, 2027 మార్చి 1న జనగణన ప్రారంభమై 2027 చివరి నాటికి పూర్తవుతుందని ఆయన తెలిపారు. కాబట్టి 2026 తర్వాత జరిగే జనగణన అనంతరం డీలిమిటేషన్ తప్పనిసరిగా జరుగుతుందని, తద్వారా సెక్షన్ 26 అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. 2028లో జరగబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు,



2029లో జరగబోయే పార్లమెంటు ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ జరిగి, కేంద్ర ప్రభుత్వం సీట్ల పెంపకం చేయక తప్పదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2026లో జరగబోయే సెన్సస్ తర్వాత మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, సీట్ల పెంపుదలతో పాటు డీలిమిటేషన్ కూడా జరుగుతుందని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.



## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలను భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లాలోని నైరుతి ప్రాంతంలో మావోయిస్టుల ఉనికికి సంబంధించి సమాచారం అందగా భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల వారోత్సవాలకు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ వారోత్సవాలకు ముందే ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం.

## తెలంగాణకు వరంగల్‌ను రెండో రాజధానిగా చేద్దాం.. అధికారులకు మంత్రి సురేఖ కీలక సూచనలు

వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలని.. జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్‌లు, గురుకుల పాఠశాలలను సీఎం ఆదేశాల మేరకు వారంలో ఒకటి, రెండుసార్లు సందర్శించాలని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. వరంగల్ జిల్లా ప్రగతికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రివ్యూ సమావేశంలో మంత్రి కొండా సురేఖ కీలక సూచనలు చేశారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో రివ్యూ మీటింగ్ జరిగింది. వరంగల్ నగర అభివృద్ధి, వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి దేవస్థానం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, రైల్వే తదితర అంశాలపై మంత్రులు సంయుక్తంగా సమీక్షించారు. ఈ సమావేశం ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరగగా, మంత్రి సీతక్క, ప్రభుత్వ అడ్వైజర్ వేం నరేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మామునూరు



ఎయిర్ పోర్టు నిధులు కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కి మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. ఎయిర్ పోర్టుకి అవసరమైన పనుల మీద దృష్టి సారించాలని మంత్రి సురేఖ చెప్పారు. వెటర్నరీ ఆసుపత్రులను కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. వర్షాకాలంలో పశువులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా చేయాలన్న సంకల్పంతో పని చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. వరంగల్ అభివృద్ధికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డీపీఆర్, టెండర్, పనులు ప్రారంభించడానికి.. పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పనిచేయాలని సూచించారు. వరంగల్ ప్రాంత చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని అయితే ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. భూ సేకరణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని రెండు రోజుల క్రితం రూ. 205 కోట్లను విడుదల చేసినట్టు చెప్పారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్‌కు సంబంధించి ప్రగతి జరుగుతుందన్నారు. వెటర్నరీ హాస్పిటల్, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయితీ కార్యాలయ భవనం నిర్మించాలని చర్చించినట్టు చెప్పారు.

## పార్టీలకతీతంగా అర్హులందరికీ రేషన్‌కార్డులు : పొన్నం

చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి మహిళా సంఘం నుంచి రూ.లక్ష రుణం ఇస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ప్లాస్టిక్



వాడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో.. ఒకేఒక్కడు స్టోక్స్



## టీ బ్రేక్: గిల్ హాఫ్ సెంచరీ..
# పోరాడుతున్న భారత్

మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో టీమ్ఇండియా పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 669 పరగులకు ఆలౌటై 331 పరుగుల ఆధిక్యం సంపాదించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. క్రిస్ వోక్స్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0) వరుస బంతుల్లో ఔటయ్యారు. దీంతో భారత్ ఒక్క పరుగు చేయకుండానే రెండు వికెట్లు కోల్పోయింది. పీకల్లోతు కష్టాల్లో పడిన టీమ్ఇండియాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (52*; 80 బంతుల్లో 8 ఫోర్లు), కేఎల్ రాహుల్ (30*; 93 బంతుల్లో 2 ఫోర్లు) ఆదుకుంటున్నారు. టీ విరామ సమయానికి భారత్ 86/2తో ఉంది. టీమ్ఇండియా ఇంకా 225 పరుగుల వెనుకంజలో ఉంది.

మాంచెస్టర్ వేదికగా ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య తెందుల్కర్ అండర్సన్ ట్రోఫీలో భాగంగా నాలుగో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఇందులో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ అటు బంతితోనూ, ఇటు బ్యాట్‌తోనూ దుమ్మురేపాడు. ఓ భారీ రికార్డ్‌ను తన సొంతం చేసుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లపాటు బౌలింగ్ చేసిన బెన్‌స్టోక్స్ 72 పరుగులిచ్చి అయిదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే బ్యాటింగ్‌లోనూ (198 బంతుల్లో 141 పరుగులు) రాణించాడు. ఈ టెస్ట్ మ్యాచ్‌లో అయిదు వికెట్ల ప్రదర్శన చేయడంతో పాటు, సెంచరీ సైతం సాధించాడు. 148 సంవత్సరాల ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన తొలి ఇంగ్లిష్ కెప్టెన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు మొత్తంగా 82 మంది ఇంగ్లాండ్‌కు టెస్ట్ కెప్టెన్లుగా వ్యవహరిస్తే ఈ ఘనత సాధించింది మాత్రం బెన్‌స్టోక్స్ ఒక్కడే కావడం విశేషం.



### ఓవరాల్‌గా అయిదో కెప్టెన్

ఓవరాల్‌గా మాత్రం బెన్‌స్టోక్స్ అయిదో కెప్టెన్‌గా నిలిచాడు. అంతకు ముందు వెస్టిండీస్‌కు చెందిన డెన్నీస్ అట్కిన్సన్ (ఆస్ట్రేలియాపై, 1955), గ్యారీ సోబర్స్ (ఇంగ్లాండ్‌పై, 1966), పాకిస్థాన్‌కు చెందిన ముస్తాక్ మహమ్మద్ (వెస్టిండీస్‌పై, 1977), ఇమ్రాన్ ఖాన్ (భారత్‌పై, 1983) ఈ ఘనత సాధించారు.

### నాలుగో ఇంగ్లాండ్ బ్యాటర్..

అలాగే ఒకే మ్యాచ్‌లో అయిదు వికెట్లు, సెంచరీ చేసిన ఇంగ్లిష్ బ్యాటర్ల జాబితాలో స్టోక్స్ నాలుగో క్రికెటర్‌గా నిలిచాడు. బెన్‌స్టోక్స్ కన్నా ముందు టోనీ జార్జ్, ఇయాన్ బోథమ్, గస్ అట్కిన్‌సన్ ఉన్నారు. ఓవరాల్‌గా స్టోక్స్ ఈ రికార్డ్ సాధించిన ఏడో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. అతడి కంటే ముందు కోలీ స్మిత్, గ్యారీ సోబర్స్, బ్రూస్ టైలర్, ఇయాన్ బోథమ్, ఇమ్రాన్ ఖాన్, రోస్టన్ చేస్ ఉన్నారు.

### మూడో క్రికెటర్‌గా..

అలాగే టెస్ట్ క్రికెట్‌లో 7,000 పరుగులు సాధించి 200 వికెట్లు తీసిన మూడో క్రికెటర్‌గానూ స్టోక్స్ నిలిచాడు. అతడి కంటే ముందు ఈ జాబితాలో గ్యారీ సోబర్స్, జాక్వెస్ కలీస్ ఉన్నారు. మొత్తానికి బెన్‌స్టోక్స్ వరల్డ్ క్లాస్ ఆల్‌రౌండర్‌గా తన సత్తా చాటుతున్నాడు. ఈ మ్యాచ్‌లో జోరూట్ (150) కూడా భారీ శతకం సాధించాడు. ప్రస్తుతం అతడు టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా అవతరించాడు.

### * చెత్త రికార్డు సొంతం చేసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా

ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లపాటు బౌలింగ్ వేసిన అతడు రెండు వికెట్లు కూల్చి ఏకంగా 112 పరుగులిచ్చాడు. అయిదు ఓవర్లు మాత్రం మెయిడిన్ చేయగలిగాడు. అయితే ఇప్పటి వరకు బుమ్రా తన టెస్ట్ కెరీర్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 100పై చిలుకు పరుగులు సమర్పించుకోవడం మాత్రం ఇదే ప్రథమం.

# సినిమా

## ఆ సినిమా హిట్ కానందుకు ఇప్పటికీ బాధగానే ఉంది : శ్రుతి హాసన్



కమల్ హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి శ్రుతి హాసన్. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. ఒక్క సినిమా చేస్తే చాలు అనుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు చెప్పారు. ఆమె పంచుకున్న విషయాలివే..

**ఒక్క సినిమా చేస్తే చాలనుకున్నా..**

నా కెరీర్‌ను నాన్న సినిమాలతో పోల్చారు. నా దృష్టిలో పోలిక అనేదే ఒక అనవసరమైన విషయం. ఎవరి ప్రత్యేకతలు వాళ్లకుంటాయి. నేను ఒక్క సినిమాలో నటిస్తే చాలు అనుకొని ఇండస్ట్రీకి వచ్చాను. నటిని కావాలనే ఆలోచన నాకు ఎప్పుడూ లేదు. దర్శకత్వం, రచన అంటే ఇష్టం. నా కథలను నేనే ఎంపిక చేసుకునేదాన్ని. సంతకం చేసిన తర్వాత నాన్నతో చెప్పేదాన్ని. నా తల్లిదండ్రులు ఎప్పుడూ నా నిర్ణయాలను తప్పు పట్టలేదు.

**ఐరన్ లెగ్ అన్నారు..**

'గబ్బర్ సింగ్' కంటే ముందు నేను తెలుగులో నటించిన రెండు సినిమాలు (అనగనగా ఓ ధీరుడు, ఓ మై ఫ్రెండ్) ఆదరణ సొంతం చేసుకోలేదు. దీంతో నాపై ఐరన్ లెగ్ అనే ముద్ర వేశారు. ఒక సినిమాలో హీరో, హీరోయిన్ ఇద్దరూ ఉంటారు. అది హిట్ అయితే హీరో వల్ల అంటారు. ఫ్లాప్ అయిందంటే హీరోయిన్ వల్ల అంటారు. ఆ తర్వాత పవన్ సరసన 'గబ్బర్ సింగ్'లో నటించాను. అది సూపర్ హిట్ అయింది. ఐరన్ లెగ్, గోల్డెన్ లెగ్ అని అనడం ఎందుకు.. నా కాళ్లను నాకు వదిలేయండి. విమర్శలు, ప్రశంసలు వద్దు.

## 'వార్ 2'లో అలియా?



సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న మూవీల్లో 'వార్ 2' ఒకటి. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వంటి స్టార్ హీరోలతో తెరకెక్కిన ఈ చిత్రంలో కియారా అద్వాణీ హీరోయిన్. యశ్‌రాజ్ ఫిల్మ్స్ తన స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మించారు. ఆగష్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవలే ట్రైలర్‌ను కూడా మేకర్స్ పంచుకున్నారు. అయితే ఈ సినిమాలో మరో బ్యూటీ కూడా భాగం కానున్నట్లు తెలుస్తోంది. 'ఆల్ఫా'లో నటిస్తోన్న అలియా భట్ ఇందులో అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. 'వార్ 2'లో హృతిక్, అలియాకు మధ్య చిన్న సన్నివేశం ఉండనున్నట్లు టాక్. షూటింగ్ సమయంలో కొద్దిమంది సిబ్బంది మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారట. తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ వాటికి బలాన్నిస్తోంది. వార్ 2 ట్రైలర్‌ను షేర్ చేస్తూ.. 'అద్భుతంగా ఉండనుంది. థియేటర్‌లో కలుద్దాం' అంటూ సడెన్‌గా సర్‌ప్రైజ్ చేసింది. దీంతో ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది.



## వచ్చే నెలలో కొత్త అవతారం

తెలుగులో మొదటి సినిమాతోనే ప్రేక్షకులను కట్టిపడేసిన ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. ఉంగరాల జుట్టు.. చూడచక్కని రూపంతో వెండితెరపై మాయ చేసింది. అందం, అభినయంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలోనే మంచి క్రేజ్ ఉన్న హీరోయిన్ గా దూసుకుపోతుంది. లేటెస్టుగా ఈ మలయాళ బ్యూటీ నటిస్తున్న సినిమా 'పరదా'. ప్రవీణ్ కండ్రేగుల సోషియో డ్రామా జానర్‌లో దీనిని తెరకెక్కించాడు. శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ ఆనంద మీడియా బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఇందులో దర్శన రాజేంద్రన్, సీనియర్ హీరోయిన్ సంగీత కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే పోస్టుప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషన్ స్పీడ్ పెంచారు. అయితే రీసెంట్‌గా హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ థియేటర్‌లో కొందరు మహిళలు విభిన్నమైన వేషధారణలో 'హరిహర వీరమల్లు' చూసేందుకు వచ్చారు. తమ చీరలని తలకు పరదాలాగా కప్పుకుని సందడి చేశారు. సినిమా స్టార్ట్ అయ్యాక కూడా తీయలేదు. తమ మొహాలు ఎవరికీ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోని అనుపమ తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'వచ్చే నెలలో నన్ను మా ఫ్రెండ్స్‌ని కూడా అక్కడ మీరు ఇలా చూడొచ్చు. ఆగస్ట్ 22న పెద్ద స్క్రీన్‌లో చూస్తారు' అంటూ పోస్ట్ చేసింది.



”

తమన్నా భాటియా తన మనసులోని మాటను బయటపెట్టడంలో ప్రసిద్ధి చెందింది. ఇటీవల ఆమె చిత్ర పరిశ్రమలో పని-జీవిత సమతుల్యతపై తన ఆలోచనలను పంచుకుంది. చాలా మంది నటులు ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల కలిగే సవాళ్ల గురించి చర్చించారు. అయితే, తమన్నాకు భిన్నమైన దృక్పథం ఉంది.

## ముక్క.. సుక్క..



సూపర్ స్టార్ రజినీకాంత్ జీవితం గురించి అందరికీ తెలిసిందే. కండక్టర్ నుంచి గ్లోబల్ స్టార్‌గా ఎదిగాడు. నిజానికి ఆయన కన్నడిగి అయినప్పటికీ తమిళనాడు సొంత రాష్ట్రంగా మారిపోయింది. తమిళ ప్రేక్షకులే ఆయనను సూపర్ స్టార్‌గా మార్చారు. అక్కడి నుంచే ఆయన పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. ఆయన నట జీవితాన్ని కొద్దిసేపు పక్కనబెడితే.. సూపర్‌స్టార్ పర్సనల్ లైఫ్ ఎంతో ఎమోషన్‌తో ముడిపడి ఉంది. కండక్టర్‌గా పని చేసిన కాలంలో ఆయన రోజూ మద్యం తాగేవాడట. మాంసం కూడా తినేవాడట. ఈ రెండూ లేకుండా రజనీకి రోజు గడిచేది కాదు. ఇలాంటి విషయాలు ఆయన జీవితంలో ఇంకా చాలా ఉన్నాయట. తాజాగా సూపర్ స్టార్ తన ఆత్మకథను రాసే పనిలో ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని దర్శకుడు లోకేష్ కనకరాజ్ రివీల్ చేశాడు. ప్రపంచానికి తెలియని ఎన్నో విషయాలు వ్యక్తిగతంగా ఆయన తనతో పంచుకున్నట్లు లోకేష్ గుర్తు చేసుకున్నాడు. 'కూలీ సినిమా సెట్స్‌లో ఖాళీగా ఉన్న సమయంలో ఆత్మకథ రాసే పనిలోనే ఉండేవారు. ఆయన జీవితం ఏ దశలో ఎలా ఉండేదని తరచూ నేను అడిగేవాడిని. ఆ కథలు నన్ను ఎంతగానో కదిలించాయి' అన్నారు. మరి ఆయన ఆత్మకథ పుస్తక రూపంలో ఎప్పుడు వెలువడుతుందో చూడాలి.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.